**విలేకరులు కావలెను**

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189



RNI:TGTEL/25/A1882

# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Karimnagar,Telangana | సంపుటి:1, సంచిక:41 | volume: 1, Issue:41 | ఆదివారం 07 సెప్టెంబర్ 2025 పేజీలు : 8 వెల : 3.00


## భారత్, రష్యాలను చైనాకు కోల్పోయాం !



తియాన్‌జిన్‌లో ఇటీవల జరిగిన షాంఘై సహకార సదస్సు (ఎస్‌సిఓ) తర్వాత భారత్, రష్యాలను చైనాకు కోల్పోయినట్లుగా కనిపిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం వ్యాఖ్యానించారు. 'అంధకార చైనాకు భారత్, రష్యాలను కోల్పోయినట్లుగా కనిపిస్తోంది. ఆ మూడు దేశాలకు కలిపి మంచి భవిష్యత్తు వుండవచ్చు' అంటూ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక అయిన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. దీంతో పాటు ప్రధాని మోడీ, రష్యా, చైనా నేతలు పుతిన్, జిన్‌పింగ్ కలిసి వున్న పాత ఫోటోను కూడా జత పరిచారు. రెండవ ప్రపంచ యుద్ధంలో విజయం సాధించి 80ఏళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని చైనాలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పుతిన్, ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్‌లతో కలిసి జిన్‌పింగ్ అమెరికాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని ఇదివరకే ట్రంప్ నోరుపారేసుకున్న సంగతి తెలిసిందే.

## సామాన్యుడిలా వచ్చిన రేవంత్ రెడ్డి

### భక్తుల మధ్య చేరి నిమజ్జన ప్రక్రియ పరిశీలన



ట్రాఫిక్ మళ్లింపులు, క్లియరెన్స్ లేకుండా పరిమిత సంఖ్యలో వాహనాలతో సాదాసీదాగా నలుగురైదుగురు వ్యక్తిగత సిబ్బందితో ట్యాంక్ బండ్ వద్దకు వచ్చిన ముఖ్యమంత్రి గారు అక్కడ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల మధ్య చేరిపోయి ఏర్పాట్లు ఎలా ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గణపతి బొప్పా... మోరియా.. అంటూ పెద్ద ఎత్తున భక్తుల నినాదాలు మారుమోగుతున్న వేళ.. ముందస్తు సమాచారం లేకుండా సాదాసీదాగా అక్కడికి చేరుకున్న ముఖ్యమంత్రి గారు భాగ్యనగర్ ఉత్సవ సమితి వేదిక పైకి ఎక్కి అశేషంగా తరలివచ్చిన భక్తులకు అభివాదం చేశారు. అదే క్రమంలో క్రేన్ నంబర్ 4 వద్దకు వెళ్లి నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ఏర్పాట్లలో పాల్గొన్న సిబ్బందిని అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు అదే స్ఫూర్తితో పని చేయాలని చెప్పారు.

## శ్రీలంకలో ఘోర రోడ్డు ప్రమాదం



శ్రీలంకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దాదాపు 30 మంది ప్రయాణీకులతో వెళ్తున్న బస్సు కొండపై నుంచి లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణీకులు మృతి చెందారు. 16 మంది గాయాలపాలయ్యారు. ఈ విషయాన్ని పోలీసు అధికారి తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసు అధికారి ఫ్రెడ్రిక్ వూట్లర్ తెలిపిన వివరాల ప్రకారం.. "కొలంబోకి తూర్పున 280 కిలోమీటర్ల దూరంలో వెల్లవాయ పట్టణానికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గురువారం రాత్రి ప్రయాణీకులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలోకి పడిపోవడంతో 15 మంది ప్రయాణీకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఐదుగురు చిన్నారులతో సహా 16 మంది గాయాలపాలయ్యారు" అని ఫ్రెడ్రిక్ చెప్పారు. డ్రైవర్ బస్సును అతివేగంతో నడపడంతో అదుపుతప్పి మరొక వాహనాన్ని ఢకొన్నది. ఆ తర్వాత బస్సు గార్డురెయిల్స్‌ను తాకి కొండపై నుంచి బోల్తాపడి లోయలోకి పడిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వూట్లర్ చెప్పారు. లోయలో పడిన బస్సు పూర్తిగా ధ్వంసమైనట్టు స్థానిక మీడియా ఫుటేజీల్లో కనిపించింది.

## ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో

### పెరియార్ చిత్రపటం



ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కీర్తిశేషులు, సంఘ సంస్కర్త 'పెరియార్' ఇ.వి. రామసామి చిత్రపటం స్ఫూర్తి నింపనుంది. ఈ చిత్రాన్ని బ్రిటన్ పర్యటనలో ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ గురువారం నాడు ఆవిష్కరించారు. పెరియార్ చిత్ర పటాన్ని ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించడం తనకెంతో గర్వకారణమని స్టాలిన్ అన్నారు. పెరియార్ స్ఫూర్తితో అన్ని దేశాల్లో అణగారిన ప్రజలకు రిజర్వేషన్లు కల్పించి..తద్వార సమాజ పురోభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా స్టాలిన్ పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల కల్పన ద్వారా అణగారిన ప్రజల హక్కులను పరిరక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. సామాజిక సేవా సంస్థలు ఈ దిశగా హక్కుల సాధనకు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురించిన 'ది కేంబ్రిడ్జ్ కాంపానియన్ టు పెరియార్' అనే పుస్తకాన్ని కూడా ఈ సందర్భంగా స్టాలిన్ ఆవిష్కరించారు. పెరియార్ రచనలను అనువదించడానికి తమిళనాడు ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రస్తావిస్తూ, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం మాదిరిగానే, ఇతర విశ్వవిద్యాలయాలు కూడా వాటిని ప్రచురించాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. పెరియార్ ఆలోచనలు ప్రపంచంలోని ప్రతి ప్రాంతానికి చేరాలని, ప్రస్తుతం ఉన్న అన్ని రకాల అణచివేతలను తొలగించాలని ఆయన కోరారు. ఉమ్మడి పౌర హక్కుల నుండి వ్యక్తిగత హక్కుల వరకు, అన్ని హక్కులను పరిరక్షించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు ఆత్మగౌరవ భావన మాత్రమే ప్రపంచ ప్రజలను వసుదైక కుటుంబంలో తోబుట్టువులుగా చేయగలదని చెప్పిన పెరియార్ మాటలను స్టాలిన్ ఉటంకించారు. ఆత్మగౌరవ ఉద్యమం విజయాన్ని ప్రతిబింబించే ఇలాంటి సమావేశాలు ఆత్మగౌరవ ఆదర్శాన్ని నిలబెట్టగలవన్నారు.

## సుప్రీంను ఆశ్రయిస్తాం



–ఉమర్ ఖలీద్‌కు బెయిల్ నిరాకరణపై కపిల్ సిబల్...

న్యూఢిల్లీ : ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించిన నేపథ్యంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ ఈ అన్యాయానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. రాజకీయంగా తమకు హాని కలుగుతుందని భావించి, ఇలాంటి అంశాలను రాజకీయ పార్టీలు లేవనెత్తనపుడు, భారతదేశ ప్రజాస్వామ్యం ఎక్కడికి వెళుతోందని ఆయన ప్రశ్నించారు. ఖలీద్ తరపు న్యాయవాది ఏడుసార్లు వాయిదాలు కోరారని మాజీ సీజేఐ డి.వై.చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఈ అంశం సుప్రీంకోర్టు ముందున్నపుడు కేవలం రెండుసార్లే వాయిదా కోరారని చెప్పారు. "ఏండ్ల తరబడి కోర్టు తీర్పు ఇవ్వకపోతే, అందుకు లాయర్లను నిందిస్తున్నారు. ఇది కోర్టుల్లోని పరిస్థితి. మీరు బెయిల్ ఇవ్వాలనుకోకపోతే వెంటనే తిరస్కరించండి, ఎందుకు 20, 30సార్లు విచారణలు జరుపుతారు?" అని సిబల్ ఇక్కడ ఒక పత్రికా సమావేశంలో ప్రశ్నించారు.

## హుస్సేన్ సాగర్‌లో బడా గణేశ్ నిమజ్జనం

- కనివినీ ఎరుగని రీతిలో భక్తజనం ఘనంగా వీడ్కోలు...
- ఎన్టీఆర్ మార్గ్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి క్రేన్‌తో నిమజ్జనం...
- వేలాది భక్తులు 'గణపతి బప్పా మోరియా' అని పెద్ద ఎత్తున నినాదాలు ..

ఖైరతాబాద్ మహా గణపతికి నభూతో నభవిష్యతి అనేలా కనివినీ ఎరుగని రీతిలో భక్తజనం ఘనంగా వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి క్రేన్ పాయింట్ 4 దగ్గర బడా గణపతి నిమజ్జనం




అనుకున్న సమయానికే ప్రశాంతంగా ముగిసింది. వేలాది భక్తులు 'గణపతి బప్పా మోరియా' అని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. మళ్లీ తిరిగి రావయ్యా వినాయకా.. అంటూ వైభవోపేతంగా సాగనంపారు. నిమజ్జనానికి ముందు ఉత్సవ సమితి సభ్యులు శాస్త్రోక్తంగా తుదిపూజలు నిర్వహించారు. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా ఖైరతాబాద్ బడా గణపతి భక్తులకు దర్శనమిచ్చాడు. 69 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది. ఇది ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాల 71వ సంవత్సరం. కోట్లాది మంది భక్తులను నవరాత్రుల్లో బడా గణేషుని దర్శనం చేసుకుని పరవశించిపోయారు. తొమ్మిది రోజుల పూజల అనంతరం సరిగ్గా ఉదయం 7 గంటలకు ఖైరతాబాద్ గణేషుని శోభాయాత్ర ఆరంభమైంది. వెల్డింగ్ వర్క్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్, సచివాలయం, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా వినాయకుడి రథయాత్ర కన్నులపండువగా సాగింది. మధ్యాహ్నం 12 గంటల కల్లా ట్యాంక్ బండ్ చేరుకుంది. సుమారు 70 అడుగుల భారీ క్రేన్ సాయంతో ఖైరతాబాద్ గణపతిని నెమ్మదిగా ఎత్తి, భక్తుల నినాదాల మధ్య హుస్సేన్ సాగర్‌లో గంగమ్మ ఒడికి చేర్చారు. నగరవ్యాప్తంగా ఉన్న వేలకొద్దీ గణనాథులుగంగమ్మ ఒడికి చేరుకునేందుకు రహదారులపై బారులు తీరారు. దీంతో హుస్సేన్ సాగర్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు జనసంద్రాన్ని తలపించాయి. మహగణపతితో పాటు అనేక వినాయక విగ్రహాలు ఒకేసారి దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో గణపయ్యను కీర్తిస్తూ నినాదాలు చేశారు. 'జై జై గణేశా... బై బై గణేశా' అంటూ ఏకదంతునికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ అపుర్వ ఘట్టాన్ని వేలాది మంది ప్రజలు స్వయంగా వీక్షించగా.. కోట్లాది మంది టెలివిజన్‌లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రత్యక్షంగా చూసి పరవశించిపోయారు. ఇక, ఖైరతాబాద్ శోభాయాత్ర జరిగే మార్గంలో ముందుగానే పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పటిష్ఠమైన భద్రత చర్యలు చేపట్టడంతో బాహుబలి క్రేన్ నంబర్ 4 వద్ద నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రశాంతంగా ముగిసింది.

## ఆదివారం ఉదయం వరకు కొనసాగే అవకాశం




హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. జిల్లాల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి కాగా, హైదరాబాద్ నగరంలో మాత్రం ఆదివారం ఉదయం వరకు కొనసాగే అవకాశం ఉందన్నారు. ఖైరతాబాద్ గణనాథుడి నిమజ్జనం ముగిసిన అనంతరం డీజీపీ జితేందర్ మీడియాతో మాట్లాడారు. విజయవంతంగా ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జనం ముగిసింది. గత ఐదేండ్ల నుంచి విజయవంతంగా నిమజ్జనం సాగుతుంది. సీనియర్ అధికారుల పర్యవేక్షణలో నిమజ్జన ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

## బీఆర్ఎస్ కీలక భేటీ



సిద్దిపేట: ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో నాలుగు గంటల నుంచి చర్చలు కొనసాగుతున్నాయి. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. హరీష్ రావుపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై ఆసక్తికర చర్చ జరుగుతున్నట్లు సమాచారం.కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి ప్రభుత్వం అప్పగించిన విషయంపై ఆదివారం కూడా సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది. కొద్దిసేపటి క్రితమే.. ఫామ్ హౌస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లినట్లు సమాచారం. అయితే.. ఫామ్ హౌస్‌లోనే హరీష్ రావు, కేటీఆర్ ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రేపటి సమావేశాల తరువాత మీడియా సమావేశం లేదా ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. అయితే మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై తాజాగా మాజీ మంత్రి హరీష్ రావు స్పందించిన విషయం తెలిసిందే. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తన నిబద్ధత అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. ప్రజల ఆకాంక్షల మేరకే పనిచేయాల్సిన బాధ్యత తనపై ఉందని నొక్కిచెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో ఓ కార్యకర్తలాగా తాను పాతికేళ్లు పనిచేశానని వ్యాఖ్యానించారు. తనపై, పార్టీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై చేసిన ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. తనపై దిగజారుడు రాజకీయాలు మంచిది కాదని హరీష్‌రావు హితవు పలికారు. ఈ నేపథ్యంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే సమావేశాల అనంతరం బీఆర్ఎస్ ఎలాంటి ప్రకటన చేస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

# ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం




**గజ్వేల్ సెప్టెంబర్ 06 మన వార్త ప్రతినిధి** ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా గురువన్నపేట ప్రభుత్వ ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను సామాజిక కార్యకర్త పాఠశాల పేరెంట్ శ్రీ జహంగీర్ గౌడ్ రెండు పాఠశాలల చైర్మన్ లతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ సమాజంలో పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయు వృత్తి. ఉపాద్యాయులు నవ సమాజ నిర్మాతలు. దీపం కరిగిపోతు వెలుగును ఎలా ఇస్తుందో ఉపాద్యాయుడు కూడా తన జీవితాన్ని ధారపోసి విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపుతారు అలాంటి ఉపాద్యాయులను సన్మానించుకోవడం ఎంతో అవసరం ఉంది అని అన్నారు ఈ కార్యక్రమంలో ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాల ప్రాధానోపాద్యులు రాజు సర్,రమేష్ సర్, చైర్మన్ లు నిర్మల,లక్ష్మి, చారి సర్,గిరిబాబు సర్ ,శ్రీకాంత్ సర్,రమేష్ సర్,చంద్రారెడ్డి సర్,మల్లికార్జున సర్ ఇందిర మేడం, అశ్విక మేడం పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల పొట్టకొట్టొద్దు: ఏ ఐ టి యు సి నాయకులు




**గజ్వేల్ సెప్టెంబర్ 06 మన వార్త ప్రతినిధి** ఆటో కార్మికుల పొట్ట కొట్టవద్దని నాయకులు ఏ ఐ టి యు సి నేతలు శివలింగు కృష్ణ, సర్గం రాజేశం అన్నారు శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మల్లన్న సాగర్ ఆటో కార్మికులు ఆటోలు నిలిపే స్థలంలో, గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డు నిర్మించారని ఆ షెడ్డును తొలగించాలని ఆటో కార్మికులు ఆందోళన చేపట్టారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ నేతలు శివలింగు కృష్ణ స్వర్గం రాజేష్ మాట్లాడుతూ, మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలు, కష్టాల కడలిలో ఉన్నారని ఆ ప్రాంతం వారు కొంత మంది జీవనోపాధి కోసం ఆటో నడిపిస్తూ గజ్వేల్ నుండి మల్లన్న సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ వరకు నడిపించే ఆటోలు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఒక స్థలంలో నిలుపుతున్నారని ఆ ప్రాంతాన్ని, కాళీ చేసే విధంగా గుర్తుతెలియని వ్యక్తులు అక్కడ షెడ్ నిర్మించారని, ప్రభుత్వం నిర్మించినా ప్రైవేటు వారు నిర్మించిన ఇక్కడ షెడ్ తొలగించి ఆటో కార్మికులకు అండగా నిలవాలని మానవతా దృక్పథంతో మల్లన్న సాగర్ ఆటో కార్మికులకు అండగా ఉండాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ ఆటో యూనియన్ అధ్యక్షులు చింతకింది శ్రీనివాస్, ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# వేలం పాటలో లడ్డు కైవసం చేసుకున్న ఏం డీ జహంగీర్



**గజ్వేల్ సెప్టెంబర్ 06 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో ఎస్సీ కాలనీ లో ఏర్పాటు చేసిన గణపతి మండపం లో ఘనంగా ముగింపు వేడుకలు నిర్వహించారు లడ్డు వేలం లో పాల్గొని 80,100 రూపాయలకు గణపతి లడ్డు కైవసం చేసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ సిద్దిపేట జిల్లా సెక్రెటరీ ఏం డీ జహంగీర్ ఈ సందర్భంగా గ్రామ యువకులు జహంగీర్ ను ఘనంగా సన్మానించి అభిందనలు తెలిపారు, అనంతరం గ్రామ యువకులు మాట్లాడుతూ ఏం డీ జహంగీర్ అన్న అంటే నేను ఉన్న అంటూ అన్ని సందర్భాలలో మాకు అండగా ఉంటూ,ప్రజలకు ఏ కష్టం ఇచ్చినా వెంటనే స్పందిస్తూ,ఆపదలో సంపదలో మాకు తోడుగా ఉంటున్న జహంగీర్ గణపతి లడ్డు వేలం పాటలో లడ్డు కైవసం చేసుకోవడం సంతోషంగా ఉందని,హిందూ ముస్లిం బాయి బాయి అంటూ హిందూ పండుగలకు అండగా ఉండడం పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న వారికి మంచి రాజకీయ భవిష్యత్తు ఉందని ముక్కోటి దేవతల అనుగ్రహం తో జహంగీర్ వారి కుటుంబం నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని గణపతిని వేడుకోవడం జరిగిందని అన్నారు

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గణపతి నిమర్జనం



**గజ్వేల్ సెప్టెంబర్ 06 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా జగదేపూర్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా నిర్వహించి గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి నిమర్జనం సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు, ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఎంసీ డైరెక్టర్ సముద్రాల హరినాథ్, ఆర్యవైశ్య సంఘం జగదేవపూర్ మండల అధ్యక్షుడు గుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ దాదాపు 50 సంవత్సరాలు క్రితం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో గణపతి విగ్రహం ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు అందరం కలిసి భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని అదే విధానం ఇప్పుడు కూడా కొనసాగడం, జరుగుతుందని ఒక ఇంటి పండుగ వలె అందరం కలిసి గణపతి నవరాత్రులు స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుద్ధ జ్యోతి మహేందర్, బుద్ధ చిన సత్యం,అమర రాము,నాచారం మాజీ డైరెక్టర్ బుద్ధ నాగరాజు, యువజన అధ్యక్షుడు రామకృష్ణ, సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మణ్,ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి పోతుగంటి శ్రీనివాస్, కోశాధికారి అయిత బాలరాజ్, పట్టణ అధ్యక్షులు చిగుల్లపల్లి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, కోశాధికారి అమర శ్రీనివాస్, జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ రావికంటి సవిత శ్రీనివాస్, మండల అధ్యక్షురాలు అమర నాగజ్యోతి రామ్ నివాస్, ప్రధాన కార్యదర్శి వల్లాల రజిత వెంకటేశం, కోశాధికారి అమర మేఘమాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు చంద్ర శేఖర్, పట్టణ మాజీ అధ్యక్షుడు కుకుటపు కొండలు , ,నాయకులు బుద్ధ సత్యపాల్,రాములు,రవి, వల్లాల సంతోష్,సాయిరాం, మడిపడిగ రాము, మణికంఠ, రావికంటి నాగరాజు మహిళలు, చిన్నారులు యువకులు,పట్టణ ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం: నక్క రాములు గౌడ్



**గజ్వేల్ సెప్టెంబర్ 06 మన వార్త ప్రతినిధి** రాబోయే స్థానికి సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ అన్నారు శనివారం గజ్వేల్ లో నక్క రాములు గౌడ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్ కే సాధ్యం అని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశలవారీగా అమలు చేస్తూ ప్రజల ఆదరణ పొందుతున్న కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు ఉన్నారని,బి ఆర్ ఎస్ పార్టీ దాదాపు పది సంవత్సరాల పాలనలో ప్రజలకు మేలు చేసిన దాఖలాలు లేవని, రేషన్ కార్డు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ కి దక్కిందని, బిఆర్ఎస్ పార్టీలో నాయకులు జేబులు నిండాయని, సామాన్య ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదని, మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసిన ఘనత బిఆర్ఎస్, కే దక్కిందని అన్నారు బిఆర్ఎస్ నేతలు అక్రమాలకు పాల్పడిన విషయం స్వయంగా బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ కూతురు కవిత చెప్పిన విషయం మనకు అందరికీ తెలిసిందే అని అన్నారు

# రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేద్దాం



**-ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యం...**
**-రాములు నేత జాగో తెలంగాణ...**

**జహీరాబాద్, సెప్టెంబర్ 6 (మన వార్త):** ఈ నెల 8 న హైదరాబాద్ సోమాజి గూడ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయ వంతం చేయాలని జాగో తెలంగాణ వ్యవస్థాపకులు రాములు నేత పిలుపు నిచ్చారు. సంగారెడి జిల్లా జహీరాబాద్ పట్టణం ఓ ప్రైవేట్ హోటల్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు నేత మాట్లాడుతూ తెలంగాణ కు వచ్చిన ఉత్తర భారత వ్యాపారులు ఇక్కడి ప్రజల సంస్కృతిని, జీవన వృత్తులను కొల్ల గొడుతూ, కల్తీ వ్యాపారాలు చేస్తూ, ప్రజలను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. అతి కష్టంగా సాధించుకున్న తెలంగాణను, కాపాడుకో వలసిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. తెలంగాణ జాగో ఆ దిశగానే ప్రజలను చైతన్య పరచడానికి స్థానిక సామాజిక కుల సంఘాల నాయకులతో కలిసి ముందు కెలుతామన్నారు. ఇక్కడి రాజకీయ పార్టీల కొందరు నాయకులు తెలంగాణేతర వ్యాపారులకు అండగా ఉంటూ, స్థానిక ప్రజల ను తప్పు దోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఉత్సవాల పేరుతో విగ్రహాలను ఊరేగిస్తూ వాతావరణాన్ని కాలుష్యం చేస్తూ, మన జీవితాలను నాశనం చేసుకుంటున్నామని విచారం వ్యక్తం చేశారు. వినాయక విగ్రహాలను తయారు చేసేది తెలంగాణేతరులని, వాటి తయారీకి వాడుతున్న ముడి సరుకు, రంగులు నాసి రకమని, విగ్రహాలను నదులలో, చెరువుల్లో, వేయడం ద్వారా నీరు కాలుష్యం అవుతుందన్నారు. వాతావరణ కాలుష్యం వలన పక్షులు కన పడకుండా పోతున్నాయని, జంతువులు, మనుషులు తీవ్ర అనారోగ్యాలకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల నిర్వాహకులు రీ సైక్లింగ్ కానీ వస్తువులను ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారని, కాలుష్య నివారణ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినాయక విగ్రహాలను కాలుష్య నివారణ అధికారుల నిఘాలో చెయ్యాలని, ఇష్టారాజ్యంగా నాసిరకం రంగులతో చేసిన ఉత్సవాల విగ్రహాలను గల్లీ గల్లీ కి పెట్టడం వలన రోజు రోజుకు వాతావరణ కాలుష్యంతో పాటు, శబ్ద కాలుష్యం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉత్తర భారత వ్యాపారుల నాసిరకం వ్యాపారాలతోనే కాలుష్యం పెరుగుతుందని, అన్ని రకాలుగా తెలంగాణ ప్రజలను మేలు కొల్పడానికి మరో ఉద్యమం చేయక తప్పదని రాములు నేత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం పి శేఖర్, మాల మహానాడు ధన్ రాజ్, జాగో తెలంగాణ కార్యవర్గ సభ్యులు యండి ఇమ్రాన్, పీ దశరథ్, యం శివ, విద్యార్థి నాయకులు కార్తీక్, రాంచరణ్, బాలకృష్ణా, రవి, కిషోర్, విష్ణు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ డ్రాఫ్ట్( ముసాయిదా) పోలింగ్ స్టేషన్స్ జాబితా విడుదల



**గజ్వేల్ సెప్టెంబర్ 06, మన వార్త ప్రతినిధి** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీటీసీ పోలింగ్ స్టేషన్స్(ముసయిదా) డ్రాఫ్ట్ జాబితా ప్రకటించనై న ది.. ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఎంపీటీసీ స్థానాలకు సంబందించిన ,పోలింగ్ స్టేషన్ల జాబితాలను అహ్మదీపూర్ గ్రామపంచాయతీలో పంచాయతీ సెక్రెటరీ కుమార్ స్వామి ప్రచురించారు.

# 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ గణేష్ యూత్ అసోసియేషన్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 6 మన వార్త :** బొల్లారం తుర్కపల్లి బట్టన్ గూడ లోని చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఈ సంఘానికి చెందిన మిత్రుల బృందం గణనాధుని విగ్రహాన్ని శామీర్‌పేట్ చెరువులో నిమజ్జనం చేస్తూ, సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నారు. పేదలకు దుప్పట్లు, ఆహారం పంపిణీ చేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సంఘంలో పవన్ కుమార్, సాయి కుమార్, భాస్కర్ రెడ్డి, సాయి గణేష్, శ్రవణ్, వేణు, చిరంజీవి, మధు, సాయి గౌడ్, సందీప్, అలోక్ రెడ్డి, బబ్లు యాదవ్ తదితరులు ప్రతిసంవత్సరం భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. సామాజిక సేవా దృక్పథంతో పాటు గణనాధుని ఆరాధనలో నిరంతరం కొనసాగుతున్న ఈ చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ గణేష్ యూత్ అసోసియేషన్ యథార్థమైన “సేవే మాకు శ్రేయస్సు” అనే సందేశాన్ని అందిస్తోంది.

# జోగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా పుస్తక పఠనోత్సవం



**చందుర్తి, సెప్టెంబర్ 06,మన వార్త** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు విద్యార్థులలో పఠన నైపుణ్యాలను పెంపొందించే విధంగా పఠనోత్సవం కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమం లో భాగంగా శనివారం జోగాపూర్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష ఉపాధ్యాయుడు మేడికాల ఆంజయ్య ఆధ్వర్యంలో పుస్తక పఠనోత్సవం, పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 600 పుస్తకాలను ప్రదర్శనకు ఉంచారు. విద్యార్థులు వివిధ రకాల పుస్తకాల యొక్క ఆవశ్యకతను తెలుసుకున్నారు, పలు పుస్తకాలను పఠనం చేశారు. నిర్వాహకులు అంజయ్య మాట్లాడుతూ. పుస్తకాలు విజ్ఞాన బాండాగారాలని, ప్రతి పుస్తకం మంచి మిత్రునితో సమానమని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని , తద్వారా అపారమైన జ్ఞాన సముపార్జన జరుగుతుందని, భవిష్యత్ లో ఏ పోటీ పరీక్షలలోనైన విజయం సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని అన్నారు. ఒక సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా కేవలం ఇరవై శాతం పుస్తకాలు మాత్రమే చదవబడుతున్నయని, ఎనబై శాతం పుస్తకాలు ఆల్మరాలకే పరిమితమవుతున్నాయన్నారు. పూర్తి స్థాయిలో విద్యార్థులు పుస్తకాలను చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రాజు, ఉపాధ్యాయులు మహేశ్, గోవర్ధన్, శ్రీనివాస్, పద్మ, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన నాగపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు



**-కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి.....**

**పెబ్బేరు.సెప్టెంబర్06 (మన వార్త ప్రతినిధి)** ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ చేస్తున్న పనులకు సంక్షేమ పథకాలకు ఆకర్షించి రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన 15 మంది బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాడల పర్వతాలు,ఉమ్మడి గోపాల్ పేట్ మండల ఇంచార్జీ సత్యశీలారెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ఎమ్మెల్యే మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో దుర్భర పరిస్థితులు ఎదుర్కొన్నామని నేడు ఇందిరమ్మ రాజ్యంలో అందరితో కలసి పనిచేయాలని ఇష్టంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ నాయకులు వేణు,చెన్నకేశవులు,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## టిబి వ్యాధిగ్రస్తులు చికిత్స సమయంలో మంచిపోషకాహారం తీసుకోవాలి



**-పోషకాహార కిట్ అందించేందుకు దాతలు ముందుకు రావాలి.....**

**-డిఎంహెచ్ఓ డా.అప్పయ్య.......**

**హనుమకొండ సెప్టెంబర్ 06(మనవార్త ప్రతినిధి):**టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం లో మనుస్ హెల్పింగ్ హ్యాండ్ ఫర్ ఆర్ఫన్ చిల్డ్రన్ సంస్థ వారి సహకారంతో 20 నిక్షయ్ పోషణ కిట్లను టీబీ పేషెంట్లకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. అప్పయ్య పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి తో బాధపడే వారు సమయానుకూలం గా మందులను వేసుకోవాలని అలాగే చక్కటి పోషక విలువలతో కూడినటువంటి ఆహారం తీసుకోవడం వల్ల క్షయ వ్యాధి నుండి త్వరగా కోలుకుంటారని ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలపడం జరిగినది.వీరికి మంచి పోషక విలువలతో కూడిన న్యూట్రిషన్ కిట్ అందించడానికి దాతలు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్వో టి.మదన్ మోహన్ రావ్,జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు మరియు పి ఓ ఏం హెచ్. న్ డా. మంజుల,మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి మనుస్ హెల్పింగ్ హ్యాండ్ ఫర్ ఆర్ఫన్ చిల్డ్రన్ సంస్థ మహేష్,జిల్లా టిబి కోఆర్డినేటర్లు సుష్మ,నగేష్, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ విజయ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**ఇల్లంతకుంట సెప్టెంబర్ 06 (మన వార్త ప్రతినిధి):**
ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణి నికేతన్ హైస్కూల్లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.పాఠశాల ఆవరణలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదన్నారు.భవిష్యత్తు తరాలను నిర్మించే వారే ఉపాధ్యాయులు అన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి,ఉపాధ్యాయులు శ్రీనివాస్,సంతోష్,రమేష్,రాజు,తిరుపతి,రాజు,సుమంగళి,శోభరేఖ,మహాలక్ష్మి,లావణ్య,సునంద,కళ్యాణి,షమీమా,జలజ,శాంత,పద్మ, రేణుక,సునీత,స్వాతి,మౌనిక,రేణుకలతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు

## చంద్ర గ్రహణం సందర్భంగా స్వర్ణగిరి ఆలయం మూసివేత...

**-స్వర్ణగిరి ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రావణాచార్యులు...**

**-స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం మానేపల్లి హిల్స్ భువనగిరి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ / 06 / మన వార్త జిల్లా ప్రతినిధి** భూలోక వైకుంఠమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో 07 -09 -2025 ఆదివారం నాడు రాహు గ్రహ గ్రస్త చంద్ర గ్రహణం సందర్భంగా త్రికాల ఆరాధనలు , నివేదనలు పూర్తి చేసుకొని ఉదయం 11:30 గంటలకు ఆలయ కవాట బంధనం చేస్తారు. (ఆలయం తలుపులు మూసివేస్తారు) అనంతరం 08 -09 -2025 సోమవారం నాడు ఆలయ శుద్ధి పుణ్యాహవచనం సంప్రోక్షణ అది కార్యక్రమాలు పూర్తి చేసుకొని మధ్యాహ్నం 2:30 గంటలకు భక్తులకు శ్రీ వారి దర్శన భాగ్యం కల్పించబడుతుంది. కావున 07 -09 -2025 ఉదయం నుండి 08 -09 -2025 మధ్యాహ్నం 2:30 గంటల వరకు స్వర్ణగిరి క్షేత్రంలో అన్ని ఆర్జిత సేవలు , దర్శనాలు నిలిపివేయబడినది. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించగలరని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు ఆదేశాల మేరకు ఆలయ ప్రధాన అర్చకులు నేడు ఒక ప్రకటనలో తెలియజేశారు.




## వడాయిగూడెంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్...



**-ఇంటి నిర్మాణపు పనులను త్వరగా పూర్తి చేయాలి...**

**-సంబంధిత అధికారులకు గ్రామ కార్యదర్శికి సూచించిన కలెక్టర్...**

**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ / 06 / మన వార్త జిల్లా ప్రతినిధి** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం రోజు భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మొత్తం ఎన్ని ఉన్నాయని , అవి ఏ ఏ దశలో ఉన్నాయో సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రారంభం కానీ ఇండ్లు ఎన్ని ఉన్నాయని సంబంధిత అధికారులను అడగడం జరిగింది. ఇంకా ఎందుకు మొదలు పెట్టలేదని అడిగారు వాళ్ళకి ఆర్థిక స్థోమత సరిగా లేక మొదలు పెట్టలేదు అని పంచాయతీ సెక్రటరీ కలెక్టర్ కు చెప్పడం జరిగింది.ఇంటి ప్రారంభానికి వాళ్ల చేతిలో డబ్బులు లేకపోతే స్థానిక మహిళా సంఘాల సభ్యులకు చెప్పి సంఘం నుండి రుణాలు ఇప్పించాలని అన్నారు. ఏఈ లు కూడా ఆలస్యం చేయకుండా వెంట వెంటనే ఫోటో తీసి అప్లోడ్ చేస్తే లబ్ధిదారుల అకౌంట్ లలో వెంటనే డబ్బులు జమ అవుతాయ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఆమని సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిమజ్జన తీరును స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్...



**-ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు జరిగేలా చూడాలి...**

**-అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ / 06 / మన వార్త జిల్లా ప్రతినిధి** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీ నగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు. శనివారం రోజు బీబీనగర్ మండల కేంద్రంలోని చెరువులో కొనసాగుతున్న నిమజ్జన తీరును స్వయంగా పరిశీలించి పలు సూచన చేశారు. నిన్న రాత్రి నుంచి ఇప్పటివరకు ఎన్ని విగ్రహాలు నిమజ్జనం చేశారని , ఇంకా మండలం , జిల్లా నుండి ఇంకా వచ్చే విగ్రహాలు ఉన్నాయని అడిగి తెలుసు కున్నారు. ఎలాంటి ఇబ్బందులు , లేకుండా ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు జరిగేలా చూడాలి అన్నారు. ఈరోజు కూడా హైదరాబాద్ నుండి విగ్రహాలు వస్తున్నాయని , కాబట్టి ఈరోజు కూడా ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు చేయాలని , అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత అధికారులకుకు సూచించారు.

## గూడూరులో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్...



**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ / 06 / మన వార్త జిల్లా ప్రతినిధి** శనివారం రోజు బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇంకా ప్రారంభించనివి ఎన్ని ఉన్నాయని సంబంధిత అధికారులు అడిగి తెలుసు కున్నారు. ప్రారంభించడానికి కూడా డబ్బులు లేని వారి ఉంటే వారికి స్థానికంగా సమభావన సంఘాల్లో సభ్యులు ఉంటే వారికి రుణం మంజూరు చేయించి ఇల్లు కట్టుకునేందుకు సహకరించాలి అన్నారు. గ్రామంలో కట్టుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లులను పరిశీలించారు. ఇటుక రేటు , మేస్త్రీ రేటు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మేస్త్రీ కి ఎక్కువ రేటు తీసుకుంటున్నారని , ఇటుక , ఇసుక కూడా రేటు ఎక్కువ తీసుకుంటున్నారని కలెక్టర్కు తెలుపగా , మేస్త్రి లను వెంటనే రేట్లు కట్టడి చేయాలని ఎంపిడిఓ , తహసీల్దార్ లకి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నాయనానందకరంగా శ్రీవారి వసంతోత్సవ సేవ...



**-శోభాయమానంగా శ్రీనివాసుడి తిరి వీధి ఉత్సవ సేవ...**

**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ / 06 / మన వార్త జిల్లా ప్రతినిధి** కలియుగ ప్రత్యక్ష దైవమైన తెలంగాణ యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో నేటి ఉదయం సుప్రభాత సేవతో మొదలుకొని రాత్రి ఏకాంత సేవ వరకు పలు కార్యక్రమాలను చేపట్టినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు , ఆలయ చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు , ఆలయ ప్రధాన అర్చకులు శ్రవణాచార్యులు తెలిపారు. ఉదయం 7 గంటలకు స్వామివారికి సహస్రనామార్చన సేవ , లోక కళ్యాణం కోసం అష్ట ఐశ్వర్య ప్రాప్తి కోసం మహాలక్ష్మి హోవనం అనంతరం శ్రీ అష్టలక్ష్మి మండపం లో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పంచామృతాలు అనగా పసుపు సుగంధ ద్రవ్యాలతో వసంతోత్సవ సేవను శోభాయి మానంగా నిర్వహించిన అనంతరం మంగళహారతులను సమర్పించారు. స్వామివారికి 10:30 లకు శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి నవరత్న ఖచిత స్వర్ణాభరణాలతో , పరిమళ భరిత పుష్ప మాలలతో అలంకరించి శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణ్ స్వామి దివ్యకరములచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో స్వామివారి నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా నేడు సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించడం జరిగింది. సాయంత్రం 6 గంటలకు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తులు తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారు దేదిప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 6:30 లకు గోదాదేవి పద్మావతి అలివేలు మంగమ్మల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య విమాన రథోత్సవం భక్తుల గోవింద నామాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు శ్రీ స్వామి వారికి కర్పూర మంగళ హారతులను సమర్పించగా శ్రీవారిని భక్తులు నయనానంద కరంగా దర్శించుకున్నారు. భారతదేశంలో ఎక్కడ లేని విధంగా స్వర్ణగిరి ఆలయ ప్రాంగణంలో శ్రీ జల నారాయణ స్వామికి ఆలయ అర్చకులు నక్షత్ర హారతిని సమర్పించారు. ఈరోజు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు తెలిపారు.

## విజయ్ విహార్ కాలనీలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 6 మన వార్త :** అల్వాల్ మచ్చ బొల్లారం డివిజన్ విజయ్ విహార్ కాలనీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ కమ్యూనిటీ భవనంలో కాలనీ ఉపాధ్యాయులను సన్మానించారు. కాలనీ అధ్యక్షులు చెరుకు నరేష్ రెడ్డి మాట్లాడుతూ, "చిన్నతనం నుండే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ భావి తరాలకు మంచి పౌరులను తీర్చిదిద్దే దిక్సూచి ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శం" అని కొనియాడారు. ఉపాధ్యాయుల సేవే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని, వారి కృషి వెలకట్టలేనిదని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు బాల్ చంద్రం మాట్లాడుతూ, తన సోదరుడు స్వర్గీయ జె. ప్రభాకర్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, విద్యా శ్రద్ధకు ప్రతీకగా నిలిచిన మహనీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాలు స్ఫూర్తిదాయకమని, ఉపాధ్యాయులే విద్యార్థులకు నిజమైన దిశానిర్దేశకులని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యాయులైన జి. పావని శ్రీనివాస్ చారి, చిన్న బక్కప్ప, ఎం. వెంకటేశ్వర్, డాన్స్ టీచర్ ఎన్. ఉమా రాజిరెడ్డి, కే. సౌజన్యలతో పాటు బెస్ట్ స్టూడెంట్స్‌గా ఎంపికైన జి. రాధ, కే. ఆర్యన్, జె. దేవాంశీలను శాలువా కప్పి జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, రవికుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ చారి, గోపి, నాగలక్ష్మి, మాజీ అధ్యక్షులు రామకృష్ణా రెడ్డి, రాజిరెడ్డి, కృష్ణారావు, మహేశ్వరి, భవాని, అనిత, లక్ష్మి, వాసవి, నాగమణి, రమాదేవి, సుజిత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో జిల్లాకు అంతర్జాతీయ కీర్తిని తీసుకురావాలి



**-హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్..**

**హనుమకొండ సెప్టెంబర్06(మనవార్త ప్రతినిధి):** క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ హనుమకొండ జిల్లాకు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని తీసుకురావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకాంక్షించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఆగస్టు30,31వ తేదీల్లో మహబూబ్ నగర్ జిల్లా పాలమూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జూనియర్ స్టేట్ మీట్ లో అథ్లెటిక్స్ లో అండర్- 16 బాలికల విభాగం లో ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచిన బాలికలు, ఈనెల 23 నుండి 25 వరకు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన పదిమంది క్రీడాకారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల ప్రతిభను కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రశంసించి మాట్లాడుతూ గుంటూరులో జరగనున్న సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లోనూ పతకాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి గుగులోతు అశోక్ కుమార్,అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కే.సారంగపాణి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి,కోశాధికారి నాగ కిషన్,కోచ్ లు శ్రీమన్నారాయణ,రమేష్, నాగరాజు,క్రీడాకారులు పాల్గొన్నారు.

## గణపతి బప్పల దర్శనంలో పాల్గొన్న మైనంపల్లి హనుమంత్ రావు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 6 మన వార్త :** మల్కాజ్గిరి నియోజకవర్గ మైనంపల్లి హనుమంత్ రావు కౌకూర్ పరిసర ప్రాంతాలలో గణనాధుని దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప, కౌకూర్ మోడల్ మార్కెట్ బజరంగ్ దళ్ యువజన సంఘం, జనప్రియ ఆర్కేడియా మరియు శ్రీ రాధే శ్యామ్ భజన మందిర యువజన సంఘం వద్ద గణపతి బప్పలను దర్శించుకున్నారు. యువజన సంఘ సభ్యులతో మమేకమై, వారి భక్తి శ్రద్ధలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ సీనియర్ లీడర్ %ు% సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున్ సహా స్థానిక యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక..

**జమ్మికుంట, సెప్టెంబర్ 06( మన వార్త ప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఎంఈఓ మంథని హేమలత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జమ్మికుంట తహసిల్దార్ వెంకట్ రెడ్డి, మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎన్ వేణుగోపాల్, బాదం సురేష్, కే శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్మికుంట మండల స్థాయిలో పదిమంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి వారిని ఘనంగా సన్మానించారు. జి సుధాకర్, అంజనీ ప్రసాద్, బి స్వప్న, డి రవీందర్, పి ప్రవీణ, బి.సారంగం, జీ రజిత, రమేష్, ఆచార్య, మాధవి, జి శ్రీనివాసులు లను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి మంచి పౌరులుగా తీర్చి దిద్దిద్దేది గురువులని తహసిల్దార్ గురువుల గురించి గొప్పగా అభివర్ణించారు. అదేవిధంగా మండల ఎంఈఓ మా మండలంలో పనిచేసే ఉపాధ్యాయులు క్రమశిక్షణతో చాలా చక్కగా విధులు నిర్వహిస్తున్నారని, అందరిని సత్కరించారు.



## జెడ్పిటిసి, ఎంపిటిసి ఓటర్ జాబితా విడుదల...



**చిన్న శంకరంపేట సెప్టెంబర్ 6( మన వార్తా ప్రతినిధి)** చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జెడ్పిటిసి ఎంపీటీసీ ఓటర్ జాబితాను ఎంపీడీవో దామోదర్ విడుదల చేశారు, స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో ఎన్నికల ముసాయిదా ఓటర్ జాబితాను ఆయన విడుదల చేసినట్లు తెలిపారు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ముసాయిదా ఓటర్ జాబితాను ఎంపీడీవో దామోదర్ విడుదల చేశారు ఆరవ తేదీ నుండి 8 వరకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించడం జరుగుతుందని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు 9న అభ్యంతరాలు పరిష్కరించి పదవ తేదీన తుది జాబితాను ప్రదర్శిస్తున్నట్లు ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీఓ గిరిజారాణి సీనియర్ అసిస్టెంట్ శ్రీలత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధతతో పని చేస్తేనే వ్యవస్థ మనుగడ సాధ్యం: కలెక్టర్ సందీప్ కుమార్



**-గ్రామ పాలన అధికారులకు నియామక పత్రాలు పంపిణీ చేసిన కలెక్టర్...**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ -06 ( మన వార్త ప్రతినిధి )** నిబద్ధతతో పనిచేస్తేనే వ్యవస్థ మనుగడ సాధ్యం అవుతుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గ్రామ పాలన అధికారులకు నియామక పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, రెవెన్యూ శాఖ ప్రభుత్వంలో చాలా కీలకమని, ప్రభుత్వ భూముల సంరక్షణ, ప్రైవేటు పట్టా భూముల రికార్డుల నిర్వహణ, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల జారీ వంటి అనేక కీలక బాధ్యతలు మన వద్ద ఉంటాయని తెలిపారు. జిల్లాలో గ్రామ పంచాయతీలకు గ్రామ పాలన అధికారులను ప్రభుత్వం నియమించిందని, వీరు క్షేత్రస్థాయిలో ప్రజలకు నిబంధనల ప్రకారం మెరుగైన సేవలు అందించాలని, ఎక్కడా అవకతవకలకు పాల్పడటానికి వీలు లేదని స్పష్టం చేశారు. సిటిజన్ చార్ట్ ప్రకారం ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చూడాలని అన్నారు. క్షేత్రస్థాయిలో అదనపు కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసిల్దార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని , గ్రామ పాలన అధికారుల పనితీరు నిరంతరం పర్యవేక్షిస్తామని వివరించారు. 3 సంవత్సరాల తర్వాత రెవెన్యూ శాఖకు గ్రామ పాలన అధికారుల రూపంలో విఆర్ఓ, విఆర్ఏ, జూనియర్ అసిస్టెంట్లు తిరిగి మాతృ శాఖ (రెవెన్యూ) రావడం జరుగుతుందని అన్నారు. నేడు నియామక పత్రాలు పొందుతున్న అభ్యర్థులు వెంటనే విధులలో చేరాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏఓ రామ్ రెడ్డి , జీ.పి.ఓ. లు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న శంకరంపేట లో ఘనంగా గణనాథుల నిమర్జనం..



**చిన్న శంకరంపేటసెప్టెంబర్ 6 ( మన వార్త ప్రతినిధి)** గత తొమ్మిది రోజులుగా వినాయక నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు గ్రామాలలో మండపాలను ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి తొమ్మిది రోజులుగా ఉదయం సాయంత్రం పూజలు నిర్వహించారు, శనివారం గణేష్ విగ్రహాలను వైభవంగా ఊరేగించి గణనాథులను ఆయా గ్రామాలలో చెరువులలో నిమర్జనం చేశారు, మండల కేంద్రంలో అయ్యప్ప యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు, సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో అన్ని గ్రామాలలో చెరువులు నిండి ఉన్నాయని వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అపశృతులు జరగకుండా అందరూ కూడా వినాయకుడిని చెరువులలో నిమర్జనం చేయాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా నిర్వహించుకోవాలని, ఆ స్వామి వారికి కృపా కటాక్షలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆయన స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో, మాజీ సర్పంచ్ రాజ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, మనోజ్ కుమార్ సుధాకర్,బిక్షపతి, డాక్టర్ సత్యనారాయణ, అయ్యప్ప యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

## జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రానికి జోనల్ స్థాయిలో మూడవ ర్యాంకు




**-రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు....**

**జమ్మికుంట, సెప్టెంబర్ 06( మన వార్త ప్రతినిధి):**

జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్ర జోనల్ స్థాయిలో మూడవ ర్యాంకు మరియు రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. వ్యవసాయ సాంకేతిక అను ప్రయోగ పరిశోధన సంస్థ ( ఏ టి ఏ ఆర్ ఐ), హైదరాబాద్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుండి 4వ తేదీ వరకు 2024 వ సంవత్సరానికి సంబంధించి కృషి విజ్ఞాన కేంద్రం, వెల్లూరు, తమిళనాడులో వార్షిక సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జోన్ పరిధిలోని తెలంగాణ, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన 72 కృషి విజ్ఞాన కేంద్రాలు పాల్గొని 2024 వ సంవత్సరం లో వారు చేసిన ప్రగతిని వివరించారు. ఇందులో భాగంగా 2024వ సంవత్సరంకు సంబంధించి కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంటకు జోనల్ స్థాయిలో మూడవ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు జమ్మికుంట కేవికే ప్రధాన కార్యదర్శి విజయ గోపాల్ రెడ్డి,సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదారాబాద్ డైరెక్టర్, అటారీ, జోన్-%శ%, డాక్టర్ షేక్.ఎన్.మీరా,తమిళనాడు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్,డాక్టర్ భారతి హరిశంకర్, అవినాశలింగంచేతుల మీదుగా జమ్మికుంట కెవికె సీనియర్ శాస్త్రవేత్త,హెడ్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు, ప్రశంసా పత్రాన్ని తీసుకొన్నారు. ఈ సందర్భంగా జమ్మికుంట కేవికె ప్రధాన కార్యదర్శి విజయ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ గుర్తింపు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బాధ్యతను మరింత పెంచిందని రాబోయే రోజుల్లో జిల్లా రైతాంగానికి మరింత సేవలందించాలని కోరారు.

# జర్నలిస్ట్ డే కార్యక్రమం 'అదుర్స్'



**మనవార్త /బుర్గంపాడు** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో ప్రెస్ క్లబ్ ఆఫ్ మన బూర్గంపాడు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డొంకన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా పాకాల దుర్గప్రసాద్ ఐటిసి కాంట్రాక్టర్, మండల కాంగ్రెస్ నాయకులు ఇంగువ రమేష్, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాదం రమేష్ రెడ్డి తదితర మండల కాంగ్రెస్ నాయకులు మరియు టిఆర్ఎస్ మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత విచ్చేశారు. జర్నలిస్ట్ డే కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ జర్నలిస్ట్ అంటే ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా ఉంటూ ప్రజలను చైతన్యపరచుటలో జర్నలిస్టుల పాత్ర అమోఘమని వ్యాఖ్యానించారు. అనంతరం జర్నలిస్టులను శాలువాతో సత్కరించి జర్నలిస్ట్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జబర్దస్త్ ఆర్టిస్టులు దొరబాబు, రైజింగ్ రాజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అదేవిధంగా పవన్ డాన్స్ అకాడమీ భద్రాచలం వారి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం ఘనంగా జరగడానికి ప్రతి ఒక్క జర్నలిస్ట్ తన వంతు కృషి చేశాడని అధ్యక్షుడు చంద్రశేఖర్ జర్నలిస్టు మిత్రులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## వేములవాడ రాజన్న ఆలయం నూతన ఈవోకు ఉద్యోగుల ఘన సన్మానం....



**వేములవాడ సెప్టెంబర్ 06 ( మన వార్త ప్రతినిధి )** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కొత్త ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా శ్రీమతి రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆమెకు ఘన సన్మానం చేశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది అందరూ పాల్గొని నూతన ఈవోకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ఈవో రమాదేవి హామీ ఇచ్చారు.

## మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా శివాంష్ జన్మదిన వేడుకలు...



**వేములవాడ సెప్టెంబర్ 05 ( మన వార్త ప్రతినిధి )** మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు,సీనియర్ జర్నలిస్టు,తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత వొడ్యాల వేణు -హరిత దంపతుల కుమారుడు చిరంజీవి వొడ్యాల శివాంష్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శనివారం మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి, మిఠాయిలు పంచి వేములవాడ శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి కృపా కటాక్షాలతో విద్యాభివృద్ధిలో రాణించి ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉత్తమ పౌరుడిగా ఖ్యాతి గడించాలని ఆకాంక్షించి, చిరంజీవి శివాంష్ కు ఆశీస్సులు అందించారు. అనంతరం ట్రస్ట్ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సేవా కార్య క్రమాల్లో భాగంగా అన్నార్థులకు అన్నదాన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్,ట్రస్ట్ సభ్యులు వొడ్యాల వేణు,గొండ ప్రసాద్, సగ్గు రాహుల్,దురిశేటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు వేములవాడలో మిలాద్ ఉన్ నబీ శోభాయాత్ర....



**వేములవాడ సెప్టెంబర్ 06 ( మన వార్త ప్రతినిధి)** మిలాద్ ఉన్ నబీ సందర్భంగా నేడు ఆదివారం వేములవాడలో శోభాయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నట్లు పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అక్రం తెలిపారు. ఈ సందర్భంగా వారు శనివారం మాట్లాడుతూ.. తిప్పాపూర్ నుండి ఉదయం 9 గంటలకు ర్యాలీ ప్రారంభమై, కోరుట్ల బస్టాండ్ వరకు కొనసాగుతుందని అనంతరం అర్బన్ కాలనీ మదీనా మసీద్ వద్ద ర్యాలీ ముగిస్తుందని తెలిపారు. ఈ ర్యాలీలో ముస్లిం యువకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొని విజయవంతం చేయాలని అక్రమ్ కోరారు.

## తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన



**జమ్మికుంట, సెప్టెంబర్ 06( మన వార్త ప్రతినిధి):** విదేశీ పత్తి దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకాల రద్దును ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సామ్రాజ్యవాద అమెరికా దేశ ఒత్తిళ్లకు తలొగ్గి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విదేశీ పత్తి దిగుమతులపై 11శాతం సుంకాన్ని రద్దు చేయడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం స్వదేశీ పత్తి రైతులను నట్టేట ముంచేందుకు పూనుకున్నదన్నారు. శనివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌరస్తా వద్ద ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేస్తూ, సుంకాల రద్దు జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2025 డిసెంబర్ 31 వరకు విదేశీ పత్తి దిగుబడులపై 11శాతం ఉన్న సుంకాలను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. రైతులపై మొసలి కన్నీరు కార్చే నరేంద్ర మోడీ రైతు వ్యతిరేక చర్యలకు పూనుకుంటున్నారని టెక్స్టైల్స్ యజమానుల కోరిక మేరకు విదేశీ పత్తి పై సుంకాని రద్దు చేసాం అనడం అవివేకం అన్నారు. మన దేశం నుండి ఎగుమతి చేసే అన్ని రకాల వస్తువులపై అమెరికా దేశం 25శాతం నుండి 50శాతం టాక్స్ పెంచితే మన కేంద్ర ప్రభుత్వం ఉన్న 11శాతం టాక్స్ రద్దు చేయడంతో మన దేశ పత్తి రైతులు అనేక ఇబ్బందులు పడతారన్నారు. విదేశాల నుండి పత్తి దిగుబడి పెద్ద ఎత్తున మన దేశంలోకి వస్తుందని దేశ రైతాంగానికి మరణశాసనంగా తయారవుతుందన్నారు. ఇప్పటికే ప్రతి సంవత్సరం పదివేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే అందులో సగం మంది పత్తి రైతులే ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఈ సుంకాల రద్దుతో ఆత్మహత్యలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసినట్లు అన్ని రకాల పంటలకు %జ%2 ప్లస్ 50శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలన్నారు. కొనుగోలు హామీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర రైతు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేయాలన్నారు. విద్యుత్ సంస్కరణల చట్టం 2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిషేధించాలన్నారు. పత్తి పంటకు గిట్టుబాటు ధర 10 వేల75 రూపాయలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పత్తి పంటను మొత్తం సీసీఐ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను పార్టీలకతీతంగా రైతులు ఎండగట్టాలని, రైతులంతా ఐక్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శీలం అశోక్, కోశాధికారి బాసర సంపత్ రావు, మండల అధ్యక్షులు కాయిత లింగారెడ్డి, నాయకులు క్రాంతి కుమార్, పుల్ల కర్ణాకర్, ఎన్ కుమార్ వి. రమేష్, సిరికొండ పోచయ్య, ఎండి ఖలీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బహుజనసేన నాయకులు...



**వేములవాడ అర్బన్ సెప్టెంబర్ 6 ( మన వార్త ప్రతినిధి )** శనివారం రోజున ప్రభుత్వ విప్ మరియు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ క్యాంపు ఆఫీస్ కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ ను మర్యాదపూర్వకంగా కలిసి సాలువతో సత్కరించి గౌతమ బుద్ధుని చిత్రపటాన్ని అందించిన బహుజన సేన రాజన్న సిరిసిల్ల నాయకులు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మరియు మైనారిటీల అభివృద్ధి కోసం పాటుపడుతున్న మంత్రివర్యులు వడ్లూరి లక్ష్మణ్ కు ప్రత్యేక అభినందనలు తెలిపాతూ, దళితుల అభ్యున్నతి కోసం చేస్తున్న కార్యక్రమాలు యువ నాయకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి లక్కే సాగర్, నేదురి శ్రీకాంత్, నేదూరి రాజు, అలవాల రాము, లక్కే దినాకర్, మల్లారం హరీష్ బహు జనసేన సేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ రాజన్న ఆలయంలో సోషల్ వెల్ఫేర్ కమిషనర్ సీతాలక్ష్మి దర్శనం, ప్రత్యేక పూజలు



**వేములవాడ సెప్టెంబర్ 06 ( మన వార్త ప్రతినిధి )** రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ కమిషనర్, ఐఏఎస్ అధికారి సీతాలక్ష్మి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వర దేవస్థానం (వేములవాడ రాజన్న ఆలయం)ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి (ఈవో) రమాదేవి సీతాలక్ష్మికి స్వామివారి ప్రసాదాన్ని అందించారు. శ్రీమతి సీతాలక్ష్మితో పాటు ప్రోటోకాల్ సహాయక నిర్వహణ అధికారి జి. అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ,హౌహౌనూగురు నరేందర్, జూనియర్ అసిస్టెంట్ సింహాచార్యులు మరియు ఆలయ సిబ్బంది ఉన్నారు.

## సిద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే నాగరాజు



**హసన్ పర్తి సెప్టెంబర్ 06(మనవార్త ప్రతినిధి):** హన్మకొండ జిల్లా హసన్పర్తి మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థి, విద్యార్థినీలతో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడి వారికి క్రమశిక్షణ, కష్టపడి చదువుకోవడం, సమయాన్ని వృధా చేయకుండా వినియోగించుకోవడం వంటి పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను సాధించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ప్రోత్సహించారు. పాఠశాలలో అవసరమైన సదుపాయాల విషయంలో తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇస్తూ, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజానికి దిక్సూచిలని,వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన సెమినార్ హాల్ సందర్శించారు. పాఠశాలకు విచ్చేసి మౌలిక సదుపాయాలను పరిశీలించిన చేసిన సందర్భంగా ఉపాధ్యాయుల విద్యార్థి విద్యార్థినీలు ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. పాఠశాల మౌలిక సదుపాయాలను పరిశీలించి విద్యార్థులు,ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే సిద్దాపూర్ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి కట్టిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు కృషి, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించి, ఉపాధ్యాయులు మరింత నిబద్ధతతో బోధించాలని కోరారు. గ్రామస్థులు మరియు పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ నాయకులు కార్యకర్తలు మరియు పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థి,విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడి నిమర్జనం వేడుకలో పాల్గొన్న ప్రభుత్వ విప్..



**-ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య...**

**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ / 06 / మన వార్త జిల్లా ప్రతినిధి** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని రామ్ శివాజీ యూత్ అసోసియేషన్ గణనాథుడి నిమర్జన వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు శివాజీ యూత్ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనం పూర్తి చేసి ఎవరి ఇంటికి వారు క్షేమంగా చేరుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు.

## చంద్ర గ్రహణం సందర్భంగా అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయం మూసివేత...



**వేములవాడ సెప్టెంబర్ 06 ( మన వార్త ప్రతినిధి )** వేములవాడ చంద్రగ్రహణం సందర్భంగా శ్రీ హనుమాన్ దేవాలయం అగ్రహారం లో తేది 07-09-2025 ఆదివారం రోజున చంద్రగ్రహణంసంబవించుచున్నందున 12-30 గంటలకుదేవాలయం మూసి వేయబడును. అని శ్రీ హనుమాన్ అగ్రహారం ఆలయ ఈవో. ఎన్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున తిరిగి 08-09-2025 సోమవారం రోజున గ్రహణ మోక్షకాలము గ్రహణ విడిచిన తరువాత ఉదయం 5-00 గంటలకు సంప్రోక్షణ జరిపిన తదుపరి ప్రతక్కాల పూజ జరిపి భక్తుల దర్శనం నిత్య పూజలు యధావిధిగానిర్వహించబడుతవని ఈ సందర్భంగా శ్రీ హనుమాన్ అగ్రహారం ఆలయ ఈవో. ఎన్. శ్రీనివాస్ తెలియజేశారు. కావున భక్తులు గమనించగలరని కోరారు.

## ఎన్కపల్లి వినాయకుల ఊరేగింపుని పర్యవేక్షించించిన సీఐ పవన్ కుమార్ రెడ్డి

**-ఎన్కపల్లి గ్రామ పంచాయితీ లడ్డును 6 లక్షల 50 వేలకు దక్కించుకున్న ప్రభాకర్ యాదవ్...**

**మొయినాబాద్ సెప్టెంబర్ 06: మన వార్త ప్రతినిధి** మొయినాబాద్ మున్సిపాలిటీ లోని ఎన్కపల్లి గ్రామంలో వినాయకుల ఊరేగిప్పు ని మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి స్వయంగా వచ్చి పర్యవేక్షించారు. గ్రామంలో ప్రతిష్టించిన అన్ని వినాయకులని ఒకేసారి ఊరేగింపు నిర్వహించడం, అంతేకాకుండా గ్రామంలోని పెద్దలు, యువకులు, అందరు కలిసి మెలిసి ఊరేగింపు నిర్వహించడం మంచి నిర్ణయం అని సీఐ పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామ పంచాయితీ లడ్డుని కైవసం చేసుకున్న ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ఎల్లప్పుడు మా గ్రామప్రజల పైన ఆ గణనాథుని దీవెనలు ఉండాలని అలాగే గణేశుని నవరాత్రులు ప్రారంభమైన నాటినుండి మొయినాబాద్ పోలీసులు ప్రత్యేక ద్రుష్టి సారించి ఎలాంటి అవంచానియా సంఘటనలు జరగకుండా పలు సూచనలు ఎప్పటికప్పుడు మండపల నిర్వాహకులకు చెప్పిన మొయినాబాద్ పోలీస్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్కపల్లి గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## వేములవాడలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ఘన స్వాగతం



**వేములవాడ సెప్టెంబర్ 06 ( మన వార్త (ప్రతినిధి)** ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి చేరుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు మంత్రిని శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన తేనెటి విందు స్వీకరించి, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల కోసం బయలుదేరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, రూరల్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుర్రం విద్యాసాగర్, నాయకులు కూరగాయల కొమురయ్య, సోయినేని కరుణాకర్ తదితరులు ఉన్నారు.

## కాకతీయ కాలనీ ఫేస్ 2 లో ఘనంగా గణపయ్య నిమజ్జనం వేడుకలు

**-హెూరాహెూరీగా లడ్డూ వేలం పాట...**

**-54100 కి లడ్డూని కైవసం చేసుకున్న వల్లెపు విష్ణువర్ధన్ దంపతులు...**

**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, సెప్టెంబర్ 5, మనవార్త** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రెండవ డివిజన్లోని చెంగిచెర్ల కాకతీయ కాలనీ ఫేస్ టు లో ఆఖరి రోజు గణేష్ నిమజ్జనం వేడుకలు మహిళల కోలాటాలతో, పిల్లల నృత్యాలతో ఘనంగా నిర్వహించిన కమిటీ సభ్యులు. ముందుగా డిజె సౌండ్ లతో, ఎంతో ఆసక్తిగా పిల్లలు మహిళలు అందరూ, ఆటపాటలతో, ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని, తర్వాత చిన్న లడ్డు లక్కీ డ్రా తీసి లక్కీ డ్రా లో గెలుపొందిన



దంపతులను చిన్న లడ్డు వారికి ఇచ్చి శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రతి సంవత్సరం అందరూ ఎంతో ఆసక్తిగా చూసే పెద్ద లడ్డు వేలంపాట గత ఏడాది 35 వేలు ధర పలికి ఈసారి ఎంతో ఉత్కంఠగా మొదలై హెూరాహెూరీగా వేలంపాటలో పాల్గొని 54,100 కి లడ్డూని కైవసం చేసుకున్న వల్లెపు బ్రహ్మయ్య ధనలక్ష్మిల కుమారుడు వల్లపు విష్ణు వర్ధన్ నాగజ్యోతి దంపతులు. వారికి మంగళహారతులతో స్వాగతం పలుకుతూ పెద్ద లడ్డు వారికి ఇచ్చి ఘనంగా సత్కరించిన కమిటీ సభ్యులు. అనంతరం రాంపల్లి చెరువు వద్ద బై బై గణేశ నినాదాలతో ఆ గణపయ్యకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు భాస్కర్ చారి, ప్రధాన కార్యదర్శి రామ్ చరణ్, కోశాధికారి సత్యనారాయణ, కమిటీ ముఖ్య సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, సిద్ధిరాజు, మహేందర్, అజయ్, విక్రం, మహేందర్, ఉపేందర్, కాలనీ మహిళలు అనురాధ, మంగమ్మ, అంజమ్మ, అరుణ,కవిత,శృతి,కారుణ్య, అంజమ్మ, రాధిక,స్రవంతి, కాలనీవాసులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్కూల్ లకు ధీటుగా ప్రభుత్వ స్కూల్ లు: మంత్రి దామోదర్ రాజనర్సింహ

**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, సెప్టెంబర్ 5, మనవార్త** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి లోని జడ్పీ కార్యాలయంలో జిల్లాలో ఉన్న కేజీబీవీ,మోడల్ స్కూల్స్,రెసిడెన్షియల్ పాఠశాలలలో సిఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న మౌలిక సదుపాయాల కల్పన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో ఉన్న కేజీబీవీ, మోడల్ స్కూల్స్, రెసిడెన్సియల్ పాఠశాలలలోని విద్యార్థుల హాస్టల్ నిర్వహణ కు



అవసరమైన సదుపాయాల కల్పన, బెడ్స్, కిచెన్ సామాగ్రి, టేబుల్స్, ప్లేట్స్,బుక్స్, డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు,స్పోర్ట్స్ కిట్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పన పై సిఎస్ఆర్ నిధులతో జిల్లాలో చేపట్టే పనులపై నివేదిక ను సమర్పించాలని అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఉన్న కేజీబీవీ, మోడల్ స్కూల్స్, రెసిడెన్సియల్ పాఠశాలలలోని విద్యార్థులకు కార్పొరేట్ స్కూల్స్ కు ధీటుగా ప్రభుత్వ రంగంలోని స్కూల్స్ లలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా , వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

## వినాయక నిమజ్జన ఉత్సవాలలో ఘర్షణ

**-పోలీసుల గస్తీ లోపం....**

**-ఇరువురికి గాయాలు....**

**జమ్మికుంట, సెప్టెంబర్ 06( మన వార్త (ప్రతినిధి):** గణపతి నవరాత్రుల ఉత్సవాల అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తారు.నిమజ్జన ఏర్పాట్లను అధికారులు స్థానిక నాయిని చెరువు దగ్గర ఏర్పాటు చేశారు. డిజేలు పెట్టకూడదని పోలీసులు ముందస్తుగా మండపాల నిర్వాహకులకు సూచనలు జారీ చేశారు. మాటలకే పరిమితం అయింది కానీ చేతల్లో చూపించలేదని,పోలీసుల గస్తీ నిర్వహించడంలో అలసత్వం వహించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.దీనికి నిదర్శనం వినాయకుల విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లే క్రమంలో నిర్వాహకులు కొందరు డిజెలు పెట్టి డ్యాన్సులు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. పాటలు పెట్టే విషయంలో యువకుల మధ్య ఘర్షణకు దారితీసింది.ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి.గొడవ సమయంలో పోలీసులకు సమాచారం అందించినా స్పందన లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.పోలీసులు బందోబస్తు నిర్వహించడం లో అలసత్వం వహించారని,పోలీసుల వైఫల్యం వల్లే గొడవ జరిగిందని పోలీసులు బందోబస్తు గట్టిగా నిర్వహించి వుంటే గొడవ జరిగింది కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజులు పూజలు చేసిన భక్తులు నిమజ్జనం రోజు భక్తిని మరచి ప్రవర్తిస్తున్నారని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. భజన కీర్తనలతో సాగానంపాల్సిన గణనాథుని కొందరు డిజె సౌండ్స్ సినిమా పాటలతో మద్యం సేవించి ఊరేగింపు చేస్తూ భక్తి మరచి వ్యవహరిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కృషి: వరంగల్ ఎంపీ కడియ కావ్య



**వరంగల్ సెప్టెంబర్ 06(మనవార్త (ప్రతినిధి):** గోవా రాష్ట్రంలో ఫ్రిడ్రిక్ ఎబర్ట్ స్టిఫ్టుంజ్ ఇండియా సంస్థ ఆర్గనైజ్ చేసిన సెమినార్‌లో శనివారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా.కడియం కావ్య పాల్గన్నారు.ఈ సందర్భంగా మహిళలు డిజిటల్ ప్రపంచంలో ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళల శక్తివృద్ధికి అవసరమైన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.చిన్న మధ్యతరగతి ఆదాయం కలిగిన దేశాల్లో మహిళలు పురుషుల కంటే 8 శాతం తక్కువగా మొబైల్ ఫోన్లు కలిగి ఉన్నారని,స్మార్ట్ ఫోన్ వినియోగంలో 13 శాతం తేడా ఉన్నట్లు వివరించారు.405 మిలియన్ల మంది మహిళలు ఇంకా డిజిటల్ ప్రపంచానికి చేరుకోలేదని,దీని వల్ల మహిళల అభివృద్ధికి పెద్ద ఆటంకమవుతున్నట్లు తెలిపారు. భారతదేశంలో 75 శాతం మహిళలు మాత్రమే మొబైల్ ఫోన్ కలిగి ఉండగా,స్మార్ట్ ఫోన్ వినియోగం కేవలం 35 శాతం మాత్రమే ఉందని వెల్లడించారు.ఈ డిజిటల్ గ్యాప్ వల్ల మహిళల ఆర్థిక స్వావలంబన, విద్య, ఆరోగ్య సేవలు పొందడంలో సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు.మహిళల పురాతన శక్తి ప్రతీకగా వరంగల్ ప్రాంతంలోని చారిత్రక ఘటనలను వివరించారు. కాకతీయ రాణీ రుద్రమదేవి నాయకత్వం,సమ్మక్క,సారలమ్మ పూజలు వంటి చారిత్రక సంఘటనలతో మహిళల శక్తిని వివరించారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం, వడ్డీరహిత రుణాలు,మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.344 కోట్ల వడ్డీలేని రుణాలను విడుదల,ఆరోగ్యసేవలకు10 లక్షల వరకూ సౌకర్యం, 2,500 నెలకు ఆర్థిక సహాయం వంటి సమర్థమైన పథకాలు అమలు అవుతున్నట్లు వివరించారు.డిజిటల్ లో మహిళల అసమానతలు తగ్గించేందుకు తక్కువ ధరకే మొబైల్ డివైసులు అందించడం,డిజిటల్ విద్య, మౌలిక సదుపాయాలు పెంపొందించడం అత్యవసరమని వరంగల్ ఎంపీ డా.కావ్య అన్నారు.ఈ దిశగా ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం గణనీయమైన కృషి చేస్తున్నదన్నారు.ఈ సదస్సులో మహిళ నాయకులు తమిళనాడు ఎంపీ ఆర్.సుధ,ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి తోబాటు పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు పంపిణీ



**జమ్మికుంట, సెప్టెంబర్ 06( మన వార్త (ప్రతినిధి):** జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను, విద్యా కమిటీ చైర్ పర్సన్, పిల్లల తల్లి దండ్రులు మరియు విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు.పాఠశాలలో మూడోవ తరగతి చదువుతున్న ఈర్ల ధార్మిక్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు ఈర్ల రమేష్, దివ్య పాఠశాలలో కేక కట్ చేసి పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ ప్లేట్లు అందించిన రమేష్,దివ్య లను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందము అభినందించారు.ప్రకృతి ప్రేమికుడైనా ఉపాధ్యాయుడు బలరాం ఉపాధ్యాయులకు ఆక్సీజన్ ఇచ్చే ప్లాంట్స్ ను పుట్టినరోజు జరుపుకున్న విద్యార్థి కి డ్రాగన్ ఫ్రూట్, మొక్కను అందించారు. పాఠశాలలో కూడా ఒక మొక్కను నాటించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా కోరపల్లి పాఠశాలలో పనిచేస్తున్న రవీందర్ ఎంపికైన సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు ప్రత్యేకమైన అభినందనలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దబ్బేట రవీందర్, ఉపాధ్యాయులు గుడిమిల్ల బలరాం, ఎస్. కుమారి, వి.వి స్పందన,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ స్రవంతి రాజు, ఈర్ల రమేష్, దివ్య, జి.సతీష్కుమార్, పిల్లల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మొయినాబాద్ రైతు వేదికలో అందుబాటులో యూరియా వ్యవసాయ అధికారి అనురాధ




**మొయినాబాద్ సెప్టెంబర్ 06:మన వార్త ప్రతినిధి** మొయినాబాద్ మండలంలోని పాక్స్ సొసైటీలో 450 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయి. రేపు ఉదయం తొమ్మిది గంటల నుంచి రైతు వేదికలో పంపిణి జరుగుతుంది యూరియాను అతి మోతాదులో వినియోగించుకోవద్దు ఇతర అవసరాలకు దుర్వినియోగం చేయవద్దు నానో యూరియా కూడా అందుబాటులో ఉంది ఇది సాధారణ గ్రాండ్యులర్ యూరియా కంటే మంచి ఫలితాలు ఇస్తుందని తప్పనిసరిగా పాస్ బుక్ ఆధార్ కార్డు తీసుకురావాలి అని మొయినాబాద్ వ్యవసాయ అధికారిని అనురాధ ప్రకటనలో తెలిపారు.

## ఇళ్ళందకుంట దేవాలయ హుండీ లెక్కింపు



**జమ్మికుంట/ ఇళ్ళందకుంట,సెప్టెంబర్( మన వార్త (ప్రతినిధి):** అపర భద్రాద్రి గా పేరుగాంచిన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇళ్ళందకుంట దేవాలయ హుండీని కరీంనగర్ డివిజన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్, రెనో రేషన్ చైర్మెన్ ఇంగిలే రామారావు,కమిటీ సభ్యులు కిషన్ రెడ్డి,నాగరాజు, గోపాల్ రెడ్డి,మల్లేష్ ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు.ఏప్రిల్ 22 నుండి సెప్టెంబర్ 06 వరకు నాలుగు నెలల 14 రోజులకు గాను రూ .859961ఆదాయం వచ్చిందని కమిటీ తెలిపారు. హిండి లెక్కింపులో ఆలయ అర్చకులు శేషం వంశి ధరచార్యులు, మడికొండ నవీన్ కుమార్ శర్మ,సిబ్బంది మోహన్ ,మల్లారెడ్డి, సురేందర్ రావు, ప్రవీణ్, రమేష్ ,రాజేందర్, శ్రీనివాస్, సేవా సమితి సభ్యులు, ఇల్లందకుంట అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ వారు పాల్గొన్నారు.

## చిన్నక్రాంతి కాలని లో హెూరా హెూరీగా లడ్డు వేలం పాట



**-లక్ష యాభై ఆరువేల రూపాయలకు లడ్డు కైవనం చేనుకున్న కొన్నే సంపత్...**

**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, సెప్టెంబర్ 6, మనవార్త.** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చిన్న క్రాంతి కాలనీలో గణేష్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ నిమజ్జన కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.నవరాత్రులు పూజలందుకున్న లడ్డు వేలం పాటలో కాలనీవాసులు, చుట్టుపక్కల ప్రజలు పాల్గొన్నారు. లడ్డు వేలంపాట హెూరాహెూరీగా సాగుతూ కాలని వాసులు సంపత్ లక్ష 56 వేల రూపాయలకు సొంతం చేసుకోగా, గణనాథుని పూజలందుకున్న కలశంను రామగుండం మధు 61,000 రూపాయలకు కైవసం చేసుకొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. కమిటీ సభ్యులు, కాలనీవాసులు ఒకే రకం దుస్తులు, తలపాగాలు ధరించి నిమజ్జన కార్యక్రమాన్ని హట్టహాసంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. కొత్త కమిటీ ఏర్పడ్డ తర్వాత నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలను విశేషమైన పూజలతో,భక్తి శ్రద్ధలతో కొనసాగించామని, రానున్న రోజుల్లో ఇంకా పెద్ద ఎత్తున కొనసాగిస్తామని, దీనికి సహకరించిన నాయకులకు, అధికారులకు కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆ గణనాథుని ఆశీస్సులు ప్రజల అందరి పైన ఉండాలని కోరారు.

# కొబ్బరితో ఆరోగ్య సమస్యలకు చెక్



కొబ్బరిలో శరీరానికి అవసరమైన అనేక పోషకాలు ఉన్నాయి. కనుక దీనిని సూపర్ ఫుడ్ అంటారు. ఇందులో ఉండే విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు శరీరానికి శక్తిని అందిస్తాయి. అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. ముఖ్యంగా కొబ్బరిని ఖాళీ కడుపుతో తింటే..మరింత అధికంగా ప్రయోజనాలు లభిస్తాయి. ఆయుర్వేదంలో కూడా కొబ్బరి జీర్ణక్రియ, రోగనిరోధక శక్తికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఖాళీ కడుపుతో కొబ్బరి తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. గ్యాస్, మలబద్ధకం, ఆమ్లత్వంతో బాధపడేవారు ఉదయం ఖాళీ కడుపుతో కొబ్బరిని ఖచ్చితంగా తినాలి. కొబ్బరిలో మీడియం చైన్ ట్రైగ్లిజరైడ్స్ ఉన్నాయి. ఇవి జీవక్రియను వేగవంతం చేస్తాయి. కొవ్వును కాల్చడానికి సహాయపడతాయి. ఖాళీ కడుపుతో క్రమం తప్పకుండా కొబ్బరి తినడం వల్ల బరువు తగ్గవచ్చు. కొబ్బరిలో యాంటీవైరల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఉదయం ఖాళీ కడుపుతో కొబ్బరిని తినడం వలన శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జలుబు, దగ్గు వంటి సాధారణ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. కొబ్బరిలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్నాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రక్తపోటును సమతుల్యం చేస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో కొబ్బరి తినడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉంటారు. దీనిలో ఉండే ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు తక్షణ శక్తిని అందిస్తాయి. అలసట త్వరగా రాకుండా నిరోధిస్తుంది. కొబ్బరి తినడం వల్ల శరీరానికి హైడ్రేషన్ లభిస్తుంది. ఇది చర్మం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే జుట్టు బలంగా, మెరుస్తూ ఉంటుంది. ఖాళీ కడుపుతో కొబ్బరి తినడం వల్ల శరీరానికి అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుతుంది. ఇది జీర్ణక్రియ, బరువు తగ్గడానికి సహాయపడటమే కాదు రోగనిరోధక శక్తి , గుండె ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే.. కొబ్బరి ఆరోగ్యకరం అని అధికంగా తినొద్దు.. పరిమిత పరిమాణంలో తినాలి ఎందుకంటే అధిక వినియోగం కొలెస్ట్రాల్ పెరగడానికి దారితీస్తుంది.

# కాఫీ తాగుతూ ఈ ఆహారాలు తింటున్నారా?





కాఫీని ఇష్టంగా దానిని ఆస్వాదిస్తూ త్రాగే వ్యక్తులు ఉంటారు. కొంతమంది సమయం గడపడానికి దీనిని తాగుతారు. ఉదయం లేదా సాయంత్రం అయినా ఒక కప్పు కాఫీ తాగితే ఒత్తిడి తగ్గుతుందని భావిస్తారు. ఆఫీసులో అయినా.. ఇంట్లో లేదా విదేశాలలో అయినా చాలా మంది కాఫీ తాగకుండా రోజు గడవదని భావిస్తారు. మితంగా కాఫీ తాగడం మంచిది. పోషకాహార నిపుణులు కాఫీ తాగడానికి ముందు లేదా తరువాత కొన్ని ఆహారాలను ఖచ్చితంగా తీసుకోకూడదని సలహా ఇస్తారు. ఎందుకంటే కాఫీలోని కొన్ని అంశాలు ఆహారంలోని పోషకాలను గ్రహించడాన్ని నిరోధిస్తాయి. మీరు కూడా కాఫీ ప్రియులైతే కాఫీతో పాటు కొన్ని రకాల ఆహారాన్ని తీసుకోకూడదు. అవి ఏమిటంటే.. కాఫీ అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన పానీయం. దాదాపు ప్రతి ఇంట్లో కాఫీ ఉండాల్సిందే. కొంతమందికి ఉదయం నిద్రలేచిన వెంటనే కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కానీ పోషకాహార నిపుణులు చక్కెర లేదా పాలు లేకుండా బ్లాక్ కాఫీ తాగాలని సిఫార్సు చేస్తున్నారు. కాఫీ తాగే ముందు లేదా తర్వాత కొన్ని ఆహారాలు తినకూడదని కూడా హెచ్చరిస్తున్నారు. ద్రాక్ష, నారింజ వంటి సిట్రస్ పండ్లను కాఫీతో కలిపి తినకండి. అలా చేయడం వల్ల శరీరంలో ఆమ్లత్వం పెరుగుతుంది. ఇది జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. కాఫీతో రెడ్ మీట్ తినవద్దు లేదా తిన్న తర్వాత కాఫీ తాగవద్దు. ఎందుకంటే ఈ పానీయం మాంసం జీర్ణం కావడాన్ని ఆలస్యం చేస్తుంది. కనుక రెడ్ మీట్, కాఫీ రెండింటినీ ఎప్పుడూ కలిపి తీసుకోవద్దు. అయితే, మీరు తాగవలసి వస్తే బ్లాక్ కాఫీ తాగవచ్చు. కానీ పాలతో కలిపి కాఫీ తాగవద్దు. ఎందుకంటే పాలతో కాఫీ తాగడం వల్ల పాలలోని కాల్షియం శోషణకు ఆటంకం కలుగుతుంది. స్నాక్స్, జంక్ ఫుడ్ లేదా వేయించిన ఆహారాలు తిన్న తర్వాత వెంటనే కాఫీ తాగవద్దు. ఇది అనవసరమైన కొవ్వు పేరుకుపోవడానికి దారితీస్తుంది. అలాగే, తృణధాన్యాలు తిన్న తర్వాత కాఫీ తాగడం మంచిది కాదు. ఇది తృణధాన్యాలలో ఉండే విటమిన్లు, ఖనిజాలను సరిగ్గా గ్రహించకుండా నిరోధిస్తుంది. కనుక కాఫీ తాగేటప్పుడు ఈ ఆహారాలను తినవద్దు.

# పలు దొంగతనాలకు పాల్పడిన యువకుడిని పట్టుకున్న పోలీసులు...




**జమ్మికుంట/వీనవంక, సెప్టెంబర్ 06( మన వార్త ప్రతినిధి):** జల్సాలకు అలవాటు పడి పేకాటకు బానిసైన ఒక యువకుడు పలు చోట్ల దొంగతనాలకు పాల్పడి, వృద్ధుల వద్ద నుండి బంగారు గొలుసులను అపహరించిన కేసును హుజూరాబాద్ పోలీసులు ఛేదించారు. నిందితుడి వద్ద నుండి సుమారు రూ. 9 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపిన వివరాల ప్రకారం,శనివారం జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, వీణవంక ఎస్సై అవుల తిరుపతి మరియు సిబ్బంది వీనవంక మండలం చల్లూరు గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా. ఈ క్రమంలో, కోర్కల్ గ్రామానికి చెందిన కొలిపాక రవి (37) అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో రవి అనేక దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అతను జల్సాలకు అలవాటుపడి పేకాట వ్యసనాలకు బానిసై, డబ్బుల కోసం ఒంటరిగా నివసించే వృద్ధులను లక్ష్యంగా చేసుకుని రాత్రి వేళల్లో వారి వద్ద ఉన్న బంగారు గొలుసులను దొంగిలించేవాడు. దొంగిలించిన బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో పెట్టి, ఆ డబ్బుతో మహారాష్ట్రలోని గడ్చందుర్‌లో పేకాట ఆడేవాడు. ఆ డబ్బును తిరిగి పేకాట, ఇతర జల్సాల కోసం ఖర్చు చేసేవాడు. నిందితుడి నుండి దాదాపు రూ. 9 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరాలు వెల్లడించారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, వీణవంక ఎస్సై అవుల తిరుపతి, మరియు సిబ్బంది మోహన్, కోమల్, ప్రశాంత్, రమేష్, మహేష్‌లను ఏసీపీ మాధవి ప్రత్యేకంగా అభినందించారు.

# డ్రై ఫ్రూట్స్.. ఎందుకు తినాలి?



డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి మంచివన్న సంగతి అందరికీ తెలిసిందే. వీటిని తినడం వల్ల శరీరంలోని ఆరోగ్య సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రతి డ్రై ఫ్రూట్‌లోనూ ఆరోగ్యానికి అవసరమైన వివిధ పోషకాలు పుష్కలంగా ఉంటాయి. డ్రై ఫ్రూట్స్ రుచికరమైనవి మాత్రమే కాదు.. ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. తరచుగా అలసిపోయినట్లు, బలహీనంగా ఉంటే ప్రతిరోజూ మీ ఆహారంలో ఖర్జూరాన్ని చేర్చుకోవాలి. ఖర్జూరాలలో సహజ చక్కెర, అనేక ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. అవి రోజంతా పని చేయడానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. బ్లూబెర్రీస్ తినడం వల్ల మెదడు చురుకుగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఎందుకంటే ఇందులో ఉండే ఆంథోసైనిన్లు మెదడు కణాలను బలోపేతం చేస్తాయి. జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయి. బ్లూబెర్రీస్ పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లతో బాధపడేవారు తమ ఆహారంలో క్రాన్బెర్రీలను చేర్చుకోవచ్చు. దీనిలోని సహజ పదార్థాలు బ్యాక్టీరియాను తగ్గిస్తాయి. ఇది యుటిఐ లక్షణాలను తగ్గిస్తుంది. ఇన్ఫెక్షన్‌ను నివారిస్తుంది. మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం పొందడంలో ఎండుద్రాక్షలు చాలా ప్రభావవంతంగా ఉంటాయి. వాటిలో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మంచి గట్ హెల్త్ కోసం ప్రతిరోజూ అంజీర్ పండ్లను తినడం అలవాటు చేసుకోవాలి. అంజీర్ పండ్లలో ప్రీబయోటిక్స్, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. మంచి గట్ బాక్టీరియాను ప్రోత్సహిస్తాయి.

# వెల్లుల్లి- తేనె కలిపి తింటే ఏమవుతుంది?



వెల్లుల్లి, తేనె రెండింటికీ యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని ప్రతి ఉదయం తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఫలితంగా జలుబు, గొంతు నొప్పి, తరచుగా వచ్చే జ్వరం వంటి సమస్యల నుండి రక్షణ లభిస్తుంది. జీర్ణవ్యవస్థ – జలుబు : వెల్లుల్లి జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. ఇది ఆహారం త్వరగా జీర్ణమవడానికి సహాయపడుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. తేనెలో ఉండే మంచి బ్యాక్టీరియా కడుపు సమస్యల నుండి ఉపశమనం ఇస్తుంది. ఈ మిశ్రమం ఒక సహజమైన కఫహరమైనదిగా పనిచేస్తుంది. ఇది శ్లేష్మాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. సైనస్‌లు, చెస్ట్ కంజెషన్‌ను తగ్గిస్తుంది. అంతేకాకుండా తేనె గొంతు నొప్పిని కూడా తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి మంచిది: ఆయుర్వేదంలో వెల్లుల్లిని గుండెకు ఎంతో మేలు చేసేదిగా భావిస్తారు. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ధమనులను శుభ్రంగా ఉంచుతుంది. రక్తాన్ని పలచుగా చేసి అడ్డంకులను నివారిస్తుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది. శక్తిని అందిస్తుంది : తేనె తక్షణ శక్తిని అందిస్తుంది. వెల్లుల్లి రక్త ప్రసరణను మెరుగుపరిచి శరీరం మొత్తానికి ఆక్సిజన్‌ను అందిస్తుంది. రెండింటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తాయి. గోరువెచ్చని నీటితో తీసుకుంటే జీవక్రియను వేగవంతం చేసి బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. ఎలా తీసుకోవాలి: తాజా వెల్లుల్లి రెబ్బలను తొక్క తీసి శుభ్రం చేయండి. ఈ రెబ్బలను ఒక శుభ్రమైన గాజు కూజాలో వేయండి. వెల్లుల్లి రెబ్బలు పూర్తిగా మునిగిపోయేలా తగినంత తేనెను పోయండి. కూజాను మూత పెట్టి గది ఉష్ణోగ్రత వద్ద 7 నుండి 10 రోజులు ఉంచాలి. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలను నమిలి తినవచ్చు. పిల్లలు, మధుమేహ వ్యాధిగ్రస్తులు దీనిని తీసకోకూడదు.

# మిరాయ్ మేజిక్ జరగాల్సిందే



కొత్త శుక్రవారం వచ్చేసింది. వేర్వేరు అంచనాలు, ప్రమోషన్లతో వచ్చిన మూడు సినిమాల జాతకం తేలిపోయింది. కమర్షియల్ గా ఎవరి స్థాయి ఏంటనేది సోమవారానికి క్లారిటీ వస్తుంది కానీ హిట్టు స్టేటస్ పక్కనపెడితే వీటిలో ఏదీ ఓ ముప్పై కోట్ల షేర్ వసూలు చేయడం జరగని పనిలా కనిపిస్తోంది. సరే వీటి జాతకం ఎలా ఉన్నా సరిగ్గా వారం రోజుల తర్వాత రాబోతున్న మిరాయ్ మీద థియేటర్ వ్యవస్థ బోలెడు ఆశలు పెట్టుకుంది. తేజ సజ్జ హీరో కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ తో పాటు చిన్న పిల్లల్లో సైతం ఇది ఆసక్తి రేపుతోంది. చాలా రీజనబుల్ బిజినెస్ జరుపుకున్న మిరాయ్ హిట్టయితే బయ్యర్లకు భారీ లాభాలొస్తాయి. అదే రోజు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కిష్కిందపురి ఉంది కానీ హారర్ ఎలిమెంట్స్ వల్ల సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. సో మిరాయ్ కు అది కూడా అడ్వాంటేజ్ కానుంది. సెప్టెంబర్ 25 ఓజి వచ్చేదాకా మిరాయ్ కు పదమూడు రోజులు ఓపెన్ గ్రౌండ్ దొరుకుతుంది. హనుమాన్ స్థాయి బ్లాక్ బస్టర్ దక్కుతుందని తేజ సజ్జ బలంగా నమ్ముతున్నాడు. పైగా ఇతర భాషల్లో బడా సంస్థలు డిస్ట్రిబ్యూట్ చేస్తుండటంతో ఇండియా వైడ్ పెద్ద రిలీజ్ అందుకుంటోంది. బొమ్మ క్లిక్ అయితే మాత్రం తేజ సజ్జ రేంజ్ పెరగడంతో పాటు విలన్ గా మంచు మనోజ్ ఇతర బాషల డైరెక్టర్ల దృష్టిలో పడతాడు. టాలీవుడ్ కున్న ప్రధాన సమస్య గత రెండు మూడు నెలలుగా వారాల తరబడి హౌస్ ఫుల్స్ చేయిస్తున్న సినిమా ఒక్కటి రాలేదు. ఏదైనా సరే వీకెండ్ హడావిడికి పరిమితమై తర్వాత నెమ్మదిస్తున్నాయి. కానీ మిరాయ్ అలా కాకూడదు. సరైన మూవీ లేదనే కారణంతోనే జనాలు థియేటర్ల వైపు పెద్దగా చూడటం లేదు. ఇప్పుడొకటి వస్తోందంటే ఖచ్చితంగా జనాలు కదులుతారు. కాకపోతే ఆ స్థాయి టాక్ ని మిరాయ్ తెచ్చుకోవాలి. మహావీర్ నరసింహ తప్ప ఈ మధ్య కాలంలో పబ్లిక్ కళకళలాడుతూ థియేటర్లలో కనిపించిన దాఖలాలు లేవు. మరి మిరాయ్ కనక ఆ లోటు తీరిస్తే మంచిదే. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీకి ఈ హిట్టు చాలా ముఖ్యం.

# భారత్ శుభారంభం



థాయ్ లాండ్‌పై 11–0తో గెలుపు – ఆసియాకప్ మహిళల హాకీ హాంగ్జూ(చైనా): ఆసియాకప్ మహిళల హాకీలో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన పూల్–బి తొలి లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 11–0తో థాయ్ లాండ్‌ను చిత్తుచేసింది. ఉదిత దుహాన్, బ్యూటీ డంగ్ డంగ్ రెండేసి గోల్స్‌తో సత్తా చాటారు. ఉదిత 30, 52వ ని.లో గోల్స్ చేయగా.. బ్యూటీ 45, 54వ ని.లో గోల్స్ చేశారు. ముంతాజ్(7వ ని.), సంగీత(10వ ని.), నవ్‌నీత్ కౌర్(16వ ని.), లాల్‌రిమిసిమి(18వ ని.), సుమన్ దేవి(49వ ని.), షర్మిల(57వ ని.), రుతుజ ధండోస్(60వ ని.) ఒక్కో గోల్స్ కొట్టారు. ఎఫ్ఐహెచ్ ర్యాంకింగ్స్‌లో భారత్ 9వ స్థానంలో, థారులాండ్ 30వ స్థానాల్లో ఉన్నాయి. తొలి రెండు క్వార్టర్‌లు ముగిసేసరికి భారత్ 5–0 ఆధిక్యతలో నిలిచింది. మొత్తం 8జట్ల మధ్య జరిగే ఈ టోర్నీలో ప్రతి గ్రూప్‌లో టాప్–2 స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్–4లో ఆడనున్నాయి. అనంతరం టాప్–2 ఉన్న జట్ల మధ్య సెప్టెంబర్ 14న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. వెటరన్ గోల్ కీపర్ సవిత పూనియా, డ్రగ్ ఫ్లికర్ దీపిక లేకుండానే ఈ టోర్నీ బరిలో భారత్ ప్రాతినిధ్యం వహిస్తోంది. టోర్నీ విజేతగా నిలిచిన జట్టు నెదర్లాండ్స్–బెల్జియం వేదికగా జరిగే 2026 మహిళల ప్రపంచకప్‌కు అర్హత సాధించనుంది. శనివారం రెండో లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు జపాన్, 8న సింగపూర్‌తో తలపడనుంది.

# తెలుగువారిని మెప్పించలేకపోయిన 'మదరాసి'



శివకార్తికేయన్ హీరోగా రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా దర్శకుడు మురుగదాస్ తెరకెక్కించిన సినిమా 'మదరాసి'. 'అమరన్' విజయన్ తర్వాత శివకార్తికేయన్ నటించిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తన చిన్నతనంలోనే ఒక ప్రమాదంలో కుటుంబం మొత్తాన్ని పోగొట్టుకున్న రఘు (శివ కార్తికేయన్) ఆ ఘటనతో డిల్యూషన్ సిండ్రోమ్ కి గురవుతాడు. ఇలా 16 ఏళ్ళు చికిత్స తర్వాత తన జీవితంలోకి మాలతి (రుక్మిణి వసంత్) వస్తుంది. ఇంకో పక్క ఇద్దరు ఫ్రెండ్స్ చిరాగ్ (షబ్బీర్), విరాట్ (విద్యుత్ జమ్వాల్) లు మొత్తం చెన్నైని గన్స్‌తో నింపాలని పెద్ద ప్లాన్ చేస్తారు. ఇది ఎన్ఐఏ వారికి పెద్ద సవాలుగా మారుతుంది. ఎన్ఐఏ అధికారి ప్రేమ్ (బిజూ మీనన్) తన బృందంతో ఆ గన్ కల్చర్ ని ఆపాలని ప్రయత్నించే మిషన్ లోకి రఘు ఎలా ప్రవేశించాడు? తన ప్రేయసి కోసం రఘు ఏం చేశాడు? ఈ గన్ మాఫియా వెనుక ఉన్నది ఎవరు? గన్ లోడ్ బయటకి రాకుండా ఆపారా, లేదా అనేది మిగతా కథ. కథనం, విశ్లేషణ: దర్శకుడు మురుగదాస్ నుంచి చాలా కాలం తర్వాత వచ్చిన ఈ సినిమాలో కొత్తదనం కనిపించదు. ఈ మధ్య కాలంలో పలు సినిమాల్లో చూపిస్తున్న గన్ కల్చర్ కాన్సెప్ట్ కి తన స్టైల్ హీరో పాత్ర, దానికో లోపం పెట్టి అక్కడక్కడా తన పాత సినిమాల స్టైల్ లోనే కథనం నడిపించారు. సినిమాలో యాక్షన్, ఎమోషనల్ పార్ట్ కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. అలాగే సెకాండఫ్‌లో కథనం కూడా అంత ఆసక్తికరంగా సాగలేదు. ఈ సినిమాను శివ కార్తికేయన్, రుక్మిణీ వసంత్ తమ నటనతో కాస్తంత నిలబెట్టే ప్రయత్నం చేశారు. ఇక సినిమా ప్రారంభం మొదలు, ముగింపు వరకూ ప్రతి సన్నివేశం కృత్రిమంగా ఉంది. కొత్తదనం ఉన్న సీన్ ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. అయితే మొత్తానికి 'మదరాసి' తెలుగువారిని మెప్పించలేకపోయాడు.

# చరిత్ర సృష్టించబోతున్నాం



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబోలో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'అఖండ–2'. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ 'అఖండ'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోంది. ఈ సినిమాలో సంయుక్తా మీనన్, హర్షల్ కీలక పాత్రలో నటిస్తుండగా.. ఆది పినిశెట్టి విలన్‌గా కనిపించబోతున్నాడు. ఈ మూవీని బాలయ్య చిన్న కూతురు 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై ఎం తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను తమన్ సంగీతం అందిస్తున్నారు. అయితే ఈ చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల వాయిదా పడింది. కానీ కొత్త రిలీజ్ డేట్‌ను మాత్రం చిత్రబృందం వెల్లడించకపోవడంతో అసలు ఈ మూవీ ఇప్పట్లో వస్తుందా? లేదా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక అఖండ–2ఎప్పుడెప్పుడు వస్తుందా? అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో.. తాజాగా, నందమూరి బాలయ్య ఓ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు వెల్లడించారు. "అఖండ–2 సినిమా డిసెంబర్‌లో విడుదల కాబోతుంది. తమన్ సంగీతంపై మరింత సమయం కావాలని అన్నాడు. అఖండ విడుదల సమయంలో సౌండ్ వూఫర్లు బద్దలయ్యాయి. కానీ అఖండ–2 డిసెంబర్‌లో దానికంటే 50 రేట్లు పెద్దగా ఉంటుంది. త్వరలో కచ్చితమైన రిలీజ్ తేదీని ప్రకటిస్తాము. అభిమానుల అంచనాలను మించి ఉంటుంది. బాక్సాఫీసులో చరిత్ర సృష్టించబోతున్నాము"అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న అభిమానులు కొందరు సంతోష పడుతుంటే.. మరికొందరు మాత్రం కాపీ చేసే సంగీతానికి ఇంకెన్ని రోజులు సమయం తీసుకుంటావని తమన్‌ను తిట్టిపోస్తున్నారు.

# జగదీశన్ డబుల్ సెంచరీ మిస్



దులీప్ ట్రోఫీ–2025 సెమీఫైనల్లో సౌత్‌జోన్ బ్యాటర్ నారాయణ్ జగదీశన్ త్రుటిలో డబుల్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. నార్త్‌జోన్‌తో జరుగుతున్న సెమీస్‌లో రెండోరోజు జగదీశన్(197) రనౌటయ్యాడు. రికీబుయ్(54), త్యాగరాజన్(58) అర్ధసెంచరీలతో రాణించడంతో సౌత్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 536పరుగుల భారీస్కోర్ చేసింది. సౌత్ జోన్ ఓపెనర్, తమిళనాడు స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ నారయణ్ జగదీశన్ డబుల్ సెంచరీకి కేవలం మూడు పరుగుల దూరంలో ఔటయ్యాడు. 148 పరుగులతో రెండో రోజు బ్యాటింగ్‌ను కొనసాగించిన జగదీశన్.. సునాయసంగా డబుల్ సెంచరీ మార్క్‌ను అందుకునేలా కన్పించాడు. కానీ 197 పరుగుల వ్యక్తిగత స్కోర్ నార్త్ జోన్ ఆటగాడు నిశాంత్ సింధు అద్భుత త్రోకు బలయ్యాడు. జగదీశన్ ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. నార్త్‌జోన్ బౌలర్లు నిషాంత్ సింధుకు ఐదు, కంబోజ్‌కు రెండు, దగర్, లోత్రాకు ఒక్కో వికెట్ దక్కాయి. వెస్ట్‌జోన్‌తో జరుగుతున్న మరో సెమీస్‌లో సెంట్రల్ జోన్ జట్టు బ్యాటర్లు అద్భుతంగా రాణించారు. మలేవార్(76), శుభమ్ శర్మ(60నాటౌట్)కి తోడు కెప్టెన్ రజత్ పటీధర్(47నాటౌట్) బ్యాటింగ్‌లో మెరిసారు. దీంతో ఆ జట్టు రెండోరోజు ఆట నిలిచే సమయానికి 2 వికెట్ల నష్టానికి 229పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 363పరుగులతో శుక్రవారం రెండోరోజు ఆటను కొనసాగించిన వెస్ట్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 438పరుగులకు ఆలౌటైంది. గైక్వాడ్(184) సెంచరీకి తోడు తనుష్ కోటియన్(76), శార్దూల్ ఠాకూర్(64) అర్ధసెంచరీలతో రాణించారు. వెస్ట్‌జోన్ జట్టు ఇంకా 209పరుగులు వెనుకబడి ఉంది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com